స్కాలర్‌షిప్ పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ ఎ.వేతేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎడ్యుకేషన్ ఎపిఫణి సంస్థ రాష్ట్రస్థాయిలో ఈ మెరిట్ పరీక్ష నిర్వహిస్తుందని 7, 10 తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఈనెల 14వ తేదీ లోపు పాఠశాలల హెచ్ఎంల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని తెలిపారు. ఈ పరీక్షకు రిజిస్ట్రేషన్కు ఎటువంటి రుసుం లేదని, పరీక్ష విధానం కూడా పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు నగదు బహుమతులు, మండల స్థాయిలో మెడల్, సర్టిఫికెట్లు అందించబడతాయని తెలిపారు.

సమస్యల నడుమ నర్సింగ్ విద్యార్థులు

- అరకొరగానే నాణ్యమైన వైద్య విద్య
- ఇరుకు గదుల్లోనే వసతి సౌకర్యం
- చెప్పుకోలేని ఇబ్బందుల్లో విద్యార్థినులు
- అనుమతులు లేకుండానే హాస్టళ్ల నిర్వహణ
- అధికారుల పర్యవేక్షణ కరువు

సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తున్న నర్సింగ్ విద్యార్థునులు(ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

కళాశాలలో పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేరని, అధ్యాపకులు లేకపోవడం వలన విద్యార్థులు ఏ విధంగా చదువుకోగలరని కొంతకాలం క్రితం కాకినాడ నగరం గాంధీనగర్లో ఉన్న రమ్య నర్సింగ్ కాలేజీలో బిఎస్సి నర్సింగ్ మొదటి, రెండవ సంవత్సరాలు చదువుతున్న విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఇక్కడే కాదు జిల్లాలో ఉన్న పలు నర్సింగ్ కళాశాలలో విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

కాకినాడలో సుమారు 20, తునిలో 2, ఏలేశ్వరం మండలం ఎర్రవరంలో 1, తాళ్లరేవు సమీపంలోని పటవల గ్రామంలో 4..ఇలా సుమారు 30 వరకూ ప్రయివేటు నర్సింగ్ కళాశాలలున్నాయి. అలాగే జిజిహెచ్కు అనుబంధంగా ఒక కళాశాల ఉండగా వీటిల్లో సుమారు 3 వేల మంది విద్యార్థులు నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్నారు. ఇంటర్మీడియట్ తరువాత నేరుగా జిఎన్ఎం కోర్సు 3 ఏళ్ళు, ఎంసెట్ లేదా నీట్ అర్హత పరీక్షలు ఉత్తీర్ణులు అయితే నాలుగేళ్లపాటు నర్సింగ్ కోర్సు చదువుకునే అవకాశం ఉంటుంది. గిరిజన ప్రాంతాలకు చెందిన విద్యార్థులే ఎక్కువమంది చదువుతున్నారు. ఎటువంటి ఫీజులు చెల్లించనవసరం లేకుండా కేవలం వసతి, భోజనం ఖర్చులు పెట్టుకుంటే సరిపోతుందంటూ సంబంధిత ప్రయివేట్ కళాశాలలకు చెందిన సిబ్బంది వీరిని ఆయా కోర్సుల్లో చేర్పిస్తున్నారు. అయితే కళాశాలలో చేరిన తర్వాత రూ.వేలల్లో ఫీజులు చెల్లించాల్సిందే అంటూ ఒత్తిళ్లకు గురి చేస్తుండటం షరామామూలే. అడిగిన ఫీజు చెల్లించకపోతే ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేది లేదంటూ ఒత్తుళ్లకు గురి చేస్తున్నారని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు కళాశాలలకు పూర్తిస్థాయిలో ఫ్యాకల్టీ లేకపోవడంతో నాణ్యమైన వైద్య విద్య విద్యార్థులకు అందని ద్రాక్షగా మారింది. వాస్తవానికి స్టూడెంట్స్ ను కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి తీసుకుని వెళ్లి క్లినికల్‌గా ట్రైనింగ్ ఇవ్వాల్సి ఉంది. కానీ పలు కళాశాలల విద్యార్థులు ఎటువంటి ట్రైనింగుకు నోచుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అరకొర వసతి సదుపాయాలు

ప్రయివేటు నర్సింగ్ కళాశాలలపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడడంతో ఆయా యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అరకొర వసతి సౌకర్యాలను మాత్రమే కల్పిస్తున్నాయి. ఇరుకు గదుల్లోనే విద్యార్థులు సర్దుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వీటిపై బహిరంగంగా చెప్పుకోలేని స్థితిలో విద్యార్థునులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జిల్లా స్థాయిలో అధికారులకు సమస్యలు చెప్పుకుంటున్నప్పటికీ పరిష్కారం దిశగా చర్యలు ఉండడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్లో కనీస సౌకర్యాలు కరువవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, భోజనం బాగోవడం లేదని చెప్తే కనీసం మార్చడం మానేసి బానే పెడుతున్నామని సమాధానం చెబుతున్నారని, కళాశాల హాస్టల్ వార్డెన్ సౌకర్యం కూడా లేకపోవడంపై ఎస్ఎఫ్ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు నిల్

జిల్లాలో ఉన్న పలు నర్సింగ్ కళాశాలల హాస్టళ్లకు ఎటువంటి అనుమతులు లేవు. నిబంధనల ప్రకారం హాస్టళ్లను నిర్వహించాల్సి ఉన్నా యాజమాన్యాలు అవేమీ పట్టించుకోకుండా వసతి గృహాలను ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. అయినా అధికారులు కనీసంగా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు వీటిపై పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా తమకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) పరిధిలోకి, పర్యవేక్షణలోకి ఈ నర్సింగ్ కళాశాలలు వస్తాయని జిల్లా అధికారులు తప్పించుకోవడం విశేషం.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

జిల్లాలో ఉన్న నర్సింగ్ కళాశాలల యాజమాన్యాలు నిబంధనలను అతిక్రమించి వ్యవహరిస్తున్నాయి. అనుమతులు లేకుండా హాస్టళ్లను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నాయి. విద్యార్థులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్‌తోపాటు, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలి.

-ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

సమావేశంలో చర్చిస్తున్న కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల నాయకులు

రైతు, కార్మిక హక్కుల కోసం ఉద్యమం

నవంబర్ 26న దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు

ప్రజాశక్తి - కాకినాడ

కార్మికులు, రైతుల డిమాండ్లపై, మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 26న దేశవ్యాప్త పిలుపులో భాగంగా కలెక్టొరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. మంగళవారం కచేరిపేట సిఐటియు కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, ఐఎఫ్‌టియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి గుబ్బల ఆదినారాయణ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల అప్పారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం డివిజన్ కార్యదర్శి మడికి సత్యం మాట్లాడారు. ఏ రంగంలో పనిచేసే కార్మికునికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచి, రోజు వేతనం రూ.600 చెల్లించాలని, బడ్జెట్లో కేటాయింపులు పెంచాలని, ఢిల్లీలో రైతాంగ పోరాటం సందర్భంగా మోడీ ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీ పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 18 లక్షల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులకు బకాయి వేతనాలు చెల్లించి, ప్రతీనెలా 5 వతేదిలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్ల సాధనకోసం నవంబర్ 26వ తేదీన జిల్లాలోని పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద, కాకినాడ కలెక్టరేట్ వద్ద జరిగే ఆందోళనలో కార్మికులు, ఉద్యోగులు, రైతులు వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని డిమాండ్లు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. నవంబర్ 6వతేదీ నుంచి 19వ తేదీ వరకూ అన్ని యూనియన్ల జనరల్ బాడీ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వ మతోన్మాద, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచారం నిర్వహించాలని, 20వ తేదీన కాకినాడ టీచర్స్ హోంలో జిల్లా సదస్సు జయప్రదం చేయాలని, అనంతరం నియోజకవర్గాల కేంద్రాల్లో ప్రాంతీయ సదస్సులు 25 వరకూ నిర్వహించాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో ఎఐఎఫ్‌టియు నాయకులు బొత్స యేసు, సిఐటియు నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు, రూరల్ కన్వీనర్ టి.రాజా, ఎపి పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కన్వీనర్ మేడిశెట్టి వెంకట రమణ, ఎఐసిసిటియు నాయకులు నరసరాజు పాల్గొన్నారు.

డివైఇఒగా ప్రభాకరశర్మ

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభాకర శర్మ

పెద్దాపురం డివిజన్ డివైఇఒగా మండల విద్యాశాఖాధికారి ఇ.ప్రభాకర శర్మను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండల విద్యాశాఖాధికారిగా ఉత్తమ సేవలందించారు. ఇప్పటి వరకూ పెద్దాపురం డివిజన్‌కు డివైఇఒగా పనిచేసిన ఎన్.వెంకటేశ్వరరావు కాకినాడ డివిజన్ డివైఇఒగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ప్రభాకర శర్మను అధికారులు నియమించారు. ఈయన త్వరలోనే డివైఇఒగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు విద్యా శాఖ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

కొనసాగిన క్లాప్ డ్రైవర్ల ఆందోళన

ప్రజాశక్తి - కాకినాడ

ధర్నా చేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్లు

బకాయి జీతాలు చెల్లించాలంటూ క్లాప్ వాహన డ్రైవర్లు చేపట్టిన ఆందోళన మంగళవారం నాటికి 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ మాట్లాడుతూ క్లాప్ వాహన డ్రైవర్లు ఆందోళన చేస్తున్నా మున్సిపల్ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికుల వద్దకు వచ్చి మున్సిపల్ అధికారులు కనీసం పలకరించే పరిస్థితి లేకపోవడం వారి నిర్లక్ష్యాన్ని స్పష్టం చేస్తుం దన్నారు. నగర పాలక సంస్థకు గత ఏడాది దేశ వ్యాప్తంగా రెండో స్థానంలో బెస్ట్ అవార్డు వచ్చిం దంటే అందుకు శానిటేషన్ కార్మికులు, క్లాప్ వాహన డ్రైవర్లే కారణమన్నారు. అటువంటి పారిశుధ్య, క్లాప్ వాహన డ్రైవర్ల పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదన్నారు. క్లాప్ డ్రైవర్ల జీతాల అంశాన్ని తక్షణమే పరిష్కరించేం దుకు మున్సిపల్ అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లాప్ వాహన డ్రైవర్స్ నాయకులు రాజు, దుర్గాప్రసాద్, శివ, టి.శ్రీను, దుర్గబాబు, ఆర్.వెంకటేష్, పాల్గొన్నారు.

2వ రోజుకు రమణరాజు దీక్ష

-మద్దతు పలికిన సిపిఎం మండల కమిటీ



వీల్‌చైర్‌లో దీక్ష చేస్తున్న దూసర్లపూడి

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ కార్పొరేషన్‌లో 8 గ్రామాలను విలీనం చేసి ఎన్నికలు నిర్వహించాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారం నాటికి రెండో రోజుకు చేరింది. వినూత్న రీతిలో ఆయన వీల్‌చైర్‌లో కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం, డిప్యూటీ సీఎంను కలిసి సమస్యను వివరించేందుకు విలీన గ్రామాల సాధన సమితికి అవకాశం ఇవ్వాలని, అందుకు కలెక్టర్, అర్బన్, రూరల్ ఎంఎల్‌ఎలు, ఎంపీ బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రకటన చేసేంత వరకూ తన దీక్ష కొనసాగుతుందని ఆయన అన్నారు.

మద్దతు తెలిపిన సిపిఎం

కార్పొరేషన్‌లో విలీనం గ్రామాలను కలిపి ఎన్నికల నిర్వహించాలని దీక్ష చేపట్టిన దూసర్లపూడి రమణరాజుకు సిపిఎం రూరల్ మండల కమిటీ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం సిపిఎం రూరల్ మండల కన్వీనర్ తిరుమలశెట్టి నాగేశ్వరరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. తొలుతగా స్థానిక సుందరయ్య భవన్‌లో చిట్టూరి విజయకుమార్ అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించి, రమణరాజు దీక్షపై చర్చించినట్లు తెలిపారు. రమణరాజు దీక్షకు, విలీన గ్రామాల ప్రక్రియ పూర్తి కావటం కోసం జరిగే పోరాటాలకు సిపిఎం మద్దతు ఉంటుందని, ప్రత్యక్ష కార్యక్రమాల్లోనూ పాల్గొంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు పెద్దింశెట్టి రామకృష్ణ, రాజా, ఎంవి. రమణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న వాలంటీర్ల దీక్ష

ప్రజాశక్తి - తాళ్లరేవు

వాలంటీర్లకు మద్దతు తెలుపుతున్న ఈశ్వరరావు

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ రూ.10వేల వేతన హామీని నెరవేర్చాలనే డిమాండ్లతో వాలంటీర్లు చేపట్టిన దీక్షలు మంగళవారం కొనసా గాయి. ఈ దీక్షలో ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మాట్లాడారు. వాలంటీర్ల న్యాయమైన కోర్కెలు ప్రభుత్వం వెంటనే పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయ కులు వాడ్రేవు శ్రీను ప్రసాద్ తదితరులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు గోవిందు, నాగమల్లేశ్వరరావు, మధుబాబు, కామేశ్వరి, దుర్గాదేవి, వెంకటరమణ, దేవి పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ముదునూరిని సత్కరిస్తున్న సర్పంచులు, ఎంపిటిసిలు

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని నియోజకవర్గ వైసిపి నాయకులు మదునూరి మురళీ కృష్ణంరాజు డిమాండ్ చేశారు. మంగళవారం ధర్మవరంలోని ముదునూరి నివాసంలో మండలంలోని ఏలూరు, చిన్న శంకర్ల పూడి గ్రామాలకు చెరందిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వైసిపిని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏపూరి రామారావు, ఎంపిటిసి సభ్యులు దాడిశెట్టి చక్రధర్, పిల్లా చిన్న పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జ్ మంత్రిని కలిసిన సిపిఎం బృందం

ప్రజాశక్తి - కాకినాడ

మంత్రికి వివరిస్తున్న సిపిఎం నాయకుడు అజేయ్‌కుమార్

జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నారాయణను సిపిఎం బృందం కలిసింది. ఈ సందర్భంగా 14 సంవత్సరాలుగా ఎన్నికలు, పాలకవర్గాలు లేని తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట, ఎస్. అచ్యుతాపురం, టీచర్స్ కాలనీలను నగర పాలక సంస్థలో తక్షణమే విలీనం చేసి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఇందుకు సంబంధించిన వినతిపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఏ మాత్రం కాలయాపన చేయకుండా ప్రభుత్వం వెంటనే విలీన గ్రామాల సమస్యపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. 2016లో టిడిపి ప్రభుత్వ పాలనలోనే ఆయా గ్రామాలను విలీనం చేస్తూ గవర్నర్ నోటిఫికేషన్ ఇచ్చారని మంత్రికి గుర్తు చేశారు. మంత్రిని కలిసిన వారిలో బృందం సభ్యులు తటవర్తి సుబ్బారావు, జయప్రకాష్ నారాయణ, అసోషియేషన్ అధ్యక్షులు జోగా అప్పారావు ఉన్నారు.

'సిద్ధార్థ'లో రోబోటిక్ కీళ్లమార్పిడి చికిత్స

ప్రజాశక్తి - కాకినాడ

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిత్యకృష్ణ

ఉభయగోదావరి జిల్లాలో తొలిసారిగా సిద్ధార్థ హాస్పిటల్‌లో రోబోటిక్ మోకాళ్ళ మార్పిడి శస్త్రచికిత్స సేవలను ప్రారంభిస్తున్నామని అర్థో నిపుణులు డాక్టర్ ఆదిత్యకృష్ణ ముత్తా అన్నారు. మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిస్సో రోబోటిక్ సిస్టమ్ పూర్తి ఆటోమేటిక్ టెక్నాలజీతో చికిత్సను ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రవేశపెట్టడం ప్రప్రథమమని అన్నారు. కీళ్ళ మార్పిడి రంగంలో రోబోటిక్ ఒక సంచలనమని, అటువంటి సేవలు కాకినాడకు తెచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. రోబోటిక్ టెక్నాలజీ వల్ల చికిత్స ఖచ్చితత్త్వం పెరుగుతుందని, అంతేకాక మానవ తప్పిదం తగ్గుతుందని తెలిపారు. ఈ రోబోటిక్ విధానం వల్ల కండకోత తక్కువగా ఉంటుందని, దాని వల్ల నొప్పి తక్కువగా ఉండి రికవరీ వేగంగా ఉంటుందని తెలిపారు. ఆపరేషన్‌కి ముందుగా మోకాలికి సిటీ స్కాన్ చేసి, ఆ సిటీ స్కాన్‌లో ఎలా ఆపరేషన్ చేయాలో సర్జన్ ప్లాన్ చేసి, ఆ ప్లాన్‌ను రోబోలోకి పంపిస్తారని, ఆ ప్లాన్‌ను రోబో ఖచ్చితంగా నిర్వహిస్తుందన్నారు. కాకినాడ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ రోబోటిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని, ఇటువంటి రోబోటిక్ కీళ్ళ మార్పిడి సర్జరీ కోసం హైదరబాద్, విజయవాడ వంటి పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రతతో ఉంటేనే మనం ఆరోగ్యవంతులుగా ఉంటామని గొల్లప్రోలు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సుబ్బారావు అన్నారు. మంగళవారం పిహెచ్‌సి పరిధిలోని ఆశ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాత శిశు సంక్షేమం, తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే సురక్షితమైన ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు పెంచాలని, చిన్నపిల్లలకి ఇచ్చే కిల్లర్ డిసీస్ వ్యాక్సిన్ సక్రమంగా ఇప్పించాలని సూచించారు. హెల్త్ వెల్నెస్ సెంటర్లు(ఆయుష్మాన్ మందిరాలు) పరిశుభ్రంగా ఉంచి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి పర్యవేక్షకులు ఎ.భాష, బి.రజిమ్, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా రక్షణ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ కృష్ణభగవాన్

మహిళా రక్షణ చట్టాలు, ఈవిటీజింగ్, మహిళలపై దాడులు, వాటిని ఎదుర్కొనే అంశాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. స్థానిక సాయి ఐశ్వర్య మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో స్థానిక సిఐ కృష్ణభగవాన్ మాట్లాడారు. విద్యార్థినులు, మహిళలు ఏదైనా అనుకోని సంఘటనలు ఎదురైనపుడు భయపడకుండా కొంత ధైర్యాన్ని వహించి వారినుంచి ఛాకచక్యం గా తప్పించుకునే ఆలోచన చేయాలన్నారు. ప్రతివారి ఫోన్లలో పోలీస్ హెల్ప్ లైన్ నంబర్లు, దిశ యాప్ ఉంచుకుని ప్రమాదం అనుకున్న సమయంలో వాటిని యాక్టివేట్ చేసి ప్రమాద పరిస్థితుల నుంచి బయట పడాలన్నారు. కళాశాలలకు వచ్చే సమయంలోనూ, తిరిగి ఇంటికి వెళ్లే సమయంలోనూ ఆకాతాయిల బెడద ఉన్నట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వేతన బకాయిలు చెల్లించాలని 104 ఉద్యోగుల వినతి

104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం జిల్లాలోని పలు కేంద్రాల్లో సంఘం నాయకులు వైద్యాధికారులకు వినతిపత్రాలను అందించారు. వేతన బకాయిలతోపాటు, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

ప్రజాశక్తి - యంత్రాంగం


పిఠాపురంలో వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

పిఠాపురం మండలంలోని మల్లం పిహెచ్‌సి వైద్యాధికారిణి డాక్టర్ జి.అనురాధకి ఉద్యోగులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు మాట్లాడుతూ 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలన్నారు. 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒలకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీర రాఘవ, సంతోష్, దుర్గాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని కాండ్రకోట పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఉషాప్రియదర్శినికి సంఘం నాయకుడు వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులు మాట్లాడుతూ తమకు 3 నెలలుగా జీతాలు చెల్లించక పోవడంతో తమ కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రాధాకృష్ణ, వెంకట్రావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలంలోని జె.అన్నవరం పిహెచ్‌సి వైద్యాధికారి ఎన్.లక్ష్మికి 104 సిబ్బంది వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ పి.స్వర్ణ తేజ మాట్లాడుతూ 104 సేవలు నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలన్నారు. డ్రైవర్లకు, డిఇఒలకు జిఓ 7 ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఇన్సూరెన్స్, పిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ పి.గోవిందరావు పాల్గొన్నారు. **తాళ్లరేవు** తమ డిమాండ్లను పరిష్కరించాలని 104 ఉద్యోగులు గాడిమొగ పిహెచ్‌సి వైద్యాధికారిణి జయభార్గవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు వేతనాలు లేక కుటుంబాలను పోషించటం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు నాగార్జున, రెడ్డి పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని వేట్లపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ హిమవతికి ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. రోగులకు నిరంతరం సేవలందిస్తున్న తమ పట్ల నిర్లక్ష్యం తగదని, తక్షణమే బకాయి వేతనాలను ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీకాంత్, త్రిమూర్తులు, వెంకట్రావు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న 104 ఉద్యోగులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - జగ్గంపేట

గుర్రప్పాలెం గ్రామ శివారు మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..జగ్గంపేటకు చెందిన సత్తారపు సతీష్, గోళ్ల నాని మండలంలోని భావరం గ్రామం నుంచి బైక్‌పై జగ్గంపేట వస్తుండగా, మార్గ సతీష్, మార్గ అబ్రహం, వేమగిరి యాకోబు జగ్గంపేట నుంచి గొల్లలగుంట వైపు వెళుతూ ఎదురుఎదురుగా డీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు అంబులెన్స్ సమాచారం ఇచ్చారు. ఎంతకీ అంబులెన్స్ రాకపోవడంతో క్షతగాత్రులను ఆటోలో స్థానిక సిహెచ్‌సికి తరలించారు. సిహెచ్‌సిలో ఒకటే వైద్యులు ఉండటంతో సరియైన వైద్యం అందలేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయివేట్ అంబులెన్స్‌ను పిలిపించుకుని కాకినాడ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గోళ్ల నాని మృతి చెందారు.

మిస్సింగ్ కేసు నమోదు

ప్రజాశక్తి - పెదపూడి

మండలంలోని కొత్తపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన అల్లిశెట్టి జయలక్ష్మి(53) మానసిక సమస్యతో బాధపడుతోంది. గతేడాది జనవరిలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలిస్తూనే ఉన్నారు. ఎంతకీ ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

పేకాడుతున్న నలుగురు అరెస్ట్

ప్రజాశక్తి - సీతానగరం

పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేశామని ఎస్‌ఐ రామ్ కుమార్ తెలిపారు. రఘుదేవపురం గ్రామంలో చెరువు వద్ద ఉన్న పొగాకు బేరన్‌లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి పేకలు, రూ.6,280 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక లారీ స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీను సోమవారం అర్ధరాత్రి సీతానగరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సాధారణ తనిఖీల్లో భాగంగా సీతానగరం ఎస్‌ఐ పెట్రోలింగ్ చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీను గుర్తించారు. వాహనాన్ని అదుపులోకి తీసుకుని, లారీ భూగర్భ శాఖ అధికారులకు బదిలీ చేశారు. ప్రస్తుతం సీతానగరం పోలీసుల ఆధీనంలో ఇసుక లారీని ఉంచారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కరప

రాష్ట్రంలోని 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని 104 ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం బ్రహ్మరుద్రులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ నాయక్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా జీతాలు లేకుండానే విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. తక్షణమే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వి.ఇందుమతి పాల్గొన్నారు.

ఓటు నమోదుకు నేటితో ముగింపు

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల నమోదు నేటితో ముగుస్తుందని తహశీల్దార్ పివిఐ.గోపాలకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రాజకీయపార్టీలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు బుధవారంతో గడువు ముగుస్తుందని, అర్హులైన పట్టభద్రులు వెంటనే సంబంధిత తహశీల్దారు, ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయాల్లో గాని, ఆన్‌లైన్ ద్వారా గాని ఓటు నమోదు చేసుకోవాలన్నారు. నమోదైన ప్రతి దరఖాస్తుపై విచారణ చేసి, అర్హత ఉన్న దరఖాస్తులను పేరు ఓటర్ల జాబితాలో పొందుపరుస్తామన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు వెలక్కు పి రఘు, అల్లబోయిన సూరిబాబు, కె.సాయిబాబు, రాంబో బాబు, కొనేటి రాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రాజాబాబు, టి.శ్రీనివాస్, పివి.రెడ్డి, ఆనంద్‌కుమార్, ఎలక్షన్ డిటి డి.కృష్ణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - పెదపూడి

చట్టాలపై బాలికలకు మహిళలకు అవగాహన తప్పనిసరని ఎస్‌ఐ రామారావు అన్నారు. మంగళవారం పెదపూడి జడ్‌పి గర్ల్స్ హైస్కూల్, జూనియర్ కళాశాల, జి.మామిడాడ గ్రామంలో గమ్మల జూనియర్ కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ మాట్లాడుతూ మహిళల భద్రత విషయంలో మహిళా రక్షక టీమ్ ఏర్పాటు చేశారని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే మహిళా రక్షక బృందానికి తెలియచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది, పెదపూడి హైస్కూల్ హెచ్ఎం సత్యనారాయణ, గమ్మల జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ శివారెడ్డి, పాల్గొన్నారు.

శ్రావణి జ్ఞాపకార్థం పలువురికి అన్నదానం

ప్రజాశక్తి - కాజులూరు

అతి చిన్న వయసులోనే అకాల మరణం చెందిన టిడిపి నాయకులు పిల్లి సత్తిబాబు కుమార్తె శ్రావణి పుట్టిన రోజు సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం పలువురికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలపల్లి జడ్‌పి హైస్కూల్‌లో సుమారు 450 మంది విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం రాఘవకృష్ణ, ఐయస్ క్లబ్ ప్రతినిధులు పొన్నాడ పేరయ్య రాజు, శ్రీనివాస రెడ్డి, సున్న దత్తు పాల్గొన్నారు.

అపార్ ఐడి కోసం విద్యార్థుల అగచాట్లు

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక పోస్టాఫీస్ కార్యాలయం విద్యార్థులతో మంగళవారం కిక్కిరిసిపోయింది. భవిష్యత్తులో విద్యార్థుల డేటా వివరాలు సమగ్రంగా ఉండేందుకు కేంద్రప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన అపార్ ఐడికి ఆధార్‌ను అనుసంధానం చేసేందుకు విద్యార్థుల సర్టిఫికెట్‌లో ఉన్న వివరాలు, ఆధార్‌లో ఉన్న వివరాలకు సరిపోల్చకపోతే మార్పులు, చేర్పులు చేసుకోవాల్సివుంది. అలా మార్పులు, చేర్పులు చేసుకోవాల్సిన విద్యార్థులు పోస్టాఫీస్‌కు తరలివచ్చారు. నాగుల చవితి కారణంగా పాఠశాలలు ఆలస్యంగా తెరుస్తుండటంతో పాటు కొన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించిన క్రమంలో వందలాది మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పెద్ద పోస్టాఫీస్ చేరుకున్నారు. 9 గంటలకు కార్యాలయం తెరిచే సమయానికే విద్యార్థులు వందల సంఖ్యలో ఆశ్చర్యానికి గురి చేసింది. ఒకవైపు ఎండల తీవ్రంగా ఉన్నప్పటికీ మెయిన్ రోడ్డుపై బారులుతీరి ఆధార్‌లో పేర్లు, వివరాలు మార్పు చేయించుకునేందుకు ఎగబడ్డారు. తమను కాలంలో విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలల్లో రికార్డుల్లో వున్న వివరాలు ఆన్‌లైన్ చేసే విధానంలో ఆధార్ వివరాలతో పోలిస్తే సరిపోయేవిధంగా ఉండే నిమిత్తం అపార్ ఐడి నమోదు జరుగుతున్నట్లు పోస్ట్ మాస్టర్ చెప్పారు. కాగా వచ్చిన విద్యార్థులకు టోకెన్లు అందించి నంబర్ల ప్రకారం వారి వివరాలు ఆధార్‌లో నమోదును సిబ్బంది చేపట్టారు.

ఆధార్ సేవలకోసం బారులుతీరిన విద్యార్థులు, తల్లిదండ్రులు

'జగన్' బాదుడు కంటే 'బాబు' బాదుడు ఎక్కువ

ప్రజాశక్తి - జగ్గంపేట, ప్రత్తిపాడు

విద్యుత్ సర్‌ఛార్జీల పేరుతో జగన్ బాదుడుకంటే నేడు చంద్రబాబు బాదుడే అధికంగా ఉందని ఎపి కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి శ్రీరామచంద్రమూర్తి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాదేటి సత్యానందరావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మరోతి శివ గణేష్ ఆరోపించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలంటూ మంగళవారం జగ్గంపేటలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కూటమి పార్టీల నేతలు అధికారంలోకి వచ్చాక పెరిగిన ధరలను తగ్గించకపోగా మరింతగా పెంచి వినియోగదారులపై భారాలను అధికం చేశారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఎఇకి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి జనరల్ సెక్రటరీ డాక్టర్ నక్కా సత్యనారాయణ, శ్రీవత్సవాయి బాబు, జిల్లా ఎస్‌సి సెల్ అధ్య క్షులు మొయ్యేటి సూర్యప్రకాశరావు, కొండా శ్రీను పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని పిసిసి సభ్యులు ధర్నాలకోట శ్రీను డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు ప్రత్తిపాడు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయ కుండా ప్రజలను మోసం చేస్తున్నాయని అన్నారు. నిత్యవసర ధరలతో పాటు, విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గిం చాలని డిమాండ్ చేశారు. అనంతరం లైన్‌మేన్ నాగేశ్వ రావుకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కంది మళ్ళ సామేలు, ఈరుగుల చక్రం, నాగేంద్ర పాల్గొన్నారు.

జగ్గంపేటలో విద్యుత్ శాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్నకాంగ్రెస్ నాయకులు

ప్రత్తిపాడులో ధర్నా చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఓట్లు నమోదు వేగవంతం చేయాలి

ధరకాస్తులను అందిస్తున్న శివన్నారాయణ

ప్రజాశక్తి - తాళ్లరేవు, సామర్లకోట

పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఓట్లు నమోదును వేగవంతం చేయాలని ముమ్మిడివరం ఎంఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ పిలుపునిచ్చారు. మంగళ వారం జనసేన నాయకుడు బండారు దొరబాబుతో కలిసి ఓట్ల నమోదుకు సంబంధించి 15 దరఖాస్తులను తహశీల్దార్ పి.త్రినాధరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ టిడిపి కూటమి అభ్యర్థిగా పేరా బత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందువల్ల అత్యధిక స్థాయిలో ఓట్లు నమోదు చేయించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దున్న మురళీకృష్ణ పాల్గొన్నారు.సామర్లకోట పట్టణంలో ఎంఎల్‌సి ఓటరు నమోదు కార్యక్రమం టిడిపి ఆధ్వర్యంలో జరిగింది. పట్టణ టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు అడబాల కుమార స్వామి, బడుగు శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో స్థానిక 31వార్డుల్లో ఉన్న పట్టభద్రులకు ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే 10వ వార్డు టిడిపి కార్యాలయంలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టి పట్టభద్రుల దరఖాస్తులను అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తాతపూడి అరుణ్‌వంశీ, దేవెళ్ళ శివకుమార్, సానిపిని హరిబాబు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - యంత్రాంగం

పెద్దాపురం రికార్డుల్లో తప్పులను సరిదిద్దేందుకు నిర్వహిస్తున్న రీ సర్వే గ్రామసభలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని తిరుపతి పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన రీ సర్వే గ్రామ సభకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సర్వేలో తప్పులు దొర్లినట్టుగా చాలామంది రైతులు భావిస్తున్నారన్నారు. వీరందరూ ఈ గ్రామ సభలో ఫిర్యాదులు అందజేస్తే వాటిపై పరిశీలన జరిపి తప్పులు సరిదిద్దేందుకు వీలు కలుగుతుందన్నారు. రెవెన్యూ కార్యాలయ ఎఒ కాంతారావు మాట్లాడుతూ రీ సెర్వేపై ప్రజల నుంచి 56 ఫిర్యాదులు అందాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సామోరు, పంచాయితీ కార్యదర్శి భార్గవ, గ్రామ సర్వేయర్ బత్తుల గాయత్రి, విఆర్ఒ ప్రసాద్ రైతులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** మండలంలోని తాటిపర్తి గ్రామ సచివాలయం వద్ద రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి తహశీల్ధార్ కెవివి.సత్యనారాయణ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలందరూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ కేదారేశ్వరరావు, ఆర్ఐ బాలకృష్ణ, విఆర్ఒ లోవరాజు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని గొంచాల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రీ సర్వే గ్రామసభ తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. సభలో 35 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్, మండల సర్వేయర్ పి.సీతారామాచార్యులు, గ్రామ సర్వేయర్లు, విఆర్ఒలు, రైతులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న సర్పంచ్ కృష్ణమూర్తి

మహిళా రక్షక్ వాహన సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

మహిళా రక్షక్ వాహన సేవలను జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ జండా ఊపి ప్రారంభించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా రక్షక్ వాహనాలు అన్ని పోలీస్ స్టేషన్లోనూ ఉంటాయని, ఈ వాహనాలతో మహిళ కానిస్టేబుల్స్, హెడ్ కానిస్టేబుల్స్ ప్రతి రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ స్కూల్, కాలేజ్, హాస్టల్స్, పార్కులు, దేవాలయాలు, పాఠశాలలు ప్రారంభించే సమయంలోను, పాఠశాలలు వదిలిన తర్వాత స్కూల్ పిల్లలు, మహిళలు ఇంటికి వెళ్లే సమయంలో రక్షణగా ఉంటారన్నారు. పై ప్రాంతాల్లో పర్యటిస్తూ వారికి రక్షణగా నిలుస్తారన్నారు. మహిళలకు, విద్యార్థిణులకు ఏ విధమైన సహకారం కావాల్సిన దయల్ 112 లేదా 100 లేదా ఎస్‌పి వాట్సాప్ హెల్ప్‌లైన్ నెం. 9494933233 కు ఫోన్ చేసి మహిళా రక్షక్ సహకారం, సేవలు పొందవచ్చునని తెలిపారు. మహిళా రక్షక్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉంటాయన్నారు. ఏ సమయంలో అయినా, జిల్లాలోని ఏ ప్రాంతం నుంచి అయినా పై నెంబర్లకు ఫోన్ చేసి సహకారం పొందవచ్చునని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి(పరిపాలన) ఎంజెవి.భాస్కరరావు, అదనపు ఎస్‌పి(ఎఆర్) ఎస్.శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్‌పి ఆర్.రామచంద్రరావు, డిఎస్‌పి చంద్రశేఖర్, ఆర్ఐ వెంకట్రావు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నష్టం లేకుండా నూతన కౌలు రైతు చట్టం

ప్రజాశక్తి - పెద్దాపురం

1956, 2019 కౌవులు రైతు చట్టాలను రద్దుచేసి ప్రభుత్వం 2024 నూతన కౌలు రైతు చట్టాన్ని తీసుకువస్తుందని మండల వ్యవసాయాధికారి కె.సంజయ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలం దివిలి గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చట్టం వల్ల భూమి యజమానికి ఎటువంటి నష్టం జరగకుండా కౌలు రైతులకు ప్రయోజనం కలిగేలా కౌలు కార్డులు రైతు సేవా కేంద్రాలలోని విఎఎల ద్వారా జారీ చేయబడతాయన్నారు. అలాగే రైతులకు డ్రోన్ టెక్నాలజీ, విత్తనాలు చల్లడం, పురుగుమందులు, ఎరువులు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎఇఒ స్రవంతి వరిలో పురుగులు, తెగుళ్ళ,వాటి లక్షణాలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. పశువులకు వచ్చే వ్యాధులు, వాటి నివారణ పద్ధతులపై పశు వైద్యాధికారి అవగాహన కల్పించారు. టిడిపి మండల అధ్యక్షులు కొత్తిం వెంకట శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సూచనలు పాటించి రైతులు అధిక దిగుబడులతో అధికాదాయం పొందాలన్నారు.

వేడుకల్లో పాల్గొన్న ఎంఎల్ఎ చినరాజప్ప

భక్తి శ్రద్ధలతో నాగుల చవితి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు, సామర్లకోట

మండలంలోని లంపకలోవ, ఉత్తరకంచి, ఇతర గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలు కుటుంబ సమేతంగా పుట్టల్లో పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. బాణాసంచా కాల్చి సందడి చేశారు. అక్కడే తమ బంధువులతో కలిసి భోజనాలు చేసి ఆనందంగా ఉల్లాసంగా గడిపారు. **సామర్లకోట** పట్టణ, మండలాల పరిధిలో గ్రామాల్లోని పంటపొలాలు, కాలువ గట్లు భక్తుల సందడితో నిండుకున్నాయి. కొప్పవరం గ్రామంలో ఎంఎల్‌ఏ నిమ్మకాయల చినరాజప్ప కుటుంబం పుట్టలో పాలు, గుడ్లు వేసి పూజలు చేపట్టారు. అమ్మణమ్మ కాలనీలో జిల్లా మానవహక్కుల సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ కుటుంబం నాగులచవితి పూజలు చేపట్టారు.

పడిపోయినవి

తూ॥గో॥జిల్లా, రాజమహేంద్రవరం పట్టణ గ్రామ కాపురస్తులు **శిరపరపు మోహన్‌రావు గారి భార్య అయిన జ్యోతికుమారి** అను నేను విన్నవించుకొను విన్నపములు.

నేను నా భర్త ఇరువురూ నా తల్లిదండ్రుల ఇంటి నుండి అనగా గోకవరం నుండి రాజమహేంద్రవరం వచ్చు దారిలో దివి. 22-10-2024 రాత్రి 7 గం॥ సమయంలో గోకవరం గ్రామ శివారులో నాకు గల అన్ రిజిష్టర్డ్ దాన శెటిల్‌మెంటు దస్తావేజు దివి. 7-5-2007 సం॥ తేదీ గల కాగితాలు పడిపోయినాయి. కావునా దానికి సంబంధించిన కాగితాలు ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు సంప్రదించి కాగితాలు ఇప్పించకోరుతాము. ఎవరైనా పై కాగితాలు దొరికిన ఎడల మాకు అందచేసినచో తగిన పారితోషికం ఇవ్వబడును. ఎవరైనా అక్రమ లబ్ధి పొందుటకు ఉపయోగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొందురు.

శిరపరపు జ్యోతికుమారి
డో.నెం. 36-28-39,
ఇన్నీసుపేట, రాజమహేంద్రవరం,
సెల్:8019220818

పోషణ వాటిక పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

పోషక విలువల ఆహార పంటలు పండించేందుకు చేపట్టిన పోషణ వాటిక పనులు మండలంలో ప్రారంభమయ్యాయని ఐసిడిఎస్ సిడిపిఒ జి.ఉష తెలిపారు. మండల పరిధిలోని ఆనూరు, కొండపల్లి, రాయ భూపాలపట్నం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఎంపిక చేసిన పోషణ వాటికలలో మట్టి, పెంట తోలే పనులు పూర్తయ్యాయన్నారు. ఈ వాటికలు చుట్టూ రక్షణ దడులు కట్టాలన్నారు. మండల పరిధిలోని కట్టమూరు గ్రామంలోని 5 అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పోషణ వాటికలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. త్వరలోనే మట్టితోలే పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ పోషణ వాటికలలో గర్భిణులు, బాలలకు పౌష్టికాహారాన్ని అందించేందుకు ఉపయోగపడే ఆహార పదార్థాల కోసం మొక్కలు, ఆకుకూరలు, కాయకూరలు, బొప్పాయి, నిమ్మ, దానిమ్మ, ఉసిరి తదితర పండ్ల చెట్లు, కరివేపాకు వంటి మొక్కలు పెంచుతారన్నారు.

జీడిమామిడి తోటలకు బీమా సౌకర్యం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

జీడిమామిడి తోటలకు ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తుందని మండల ఉద్యానవన అధికారి శ్రీవల్లి తెలిపారు. మండలంలోని లింగంపర్తి శివారు కొండ తిమ్మాపురం గిరిజన గ్రామంలో మంగళవారం రైతు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీడి మామిడి రైతు నవంబర్ 15లోగా రూ.1500 చెల్లించి బీమా సౌకర్యం పొందాలన్నారు. బీమా 2025 ఏప్రిల్ 30 వరకూ చెల్లుబాటు అవుతుందని తెలిపారు. మూడేళ్ల పైబడిన తోటలు మాత్రమే బీమాకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా సంభవించిన నష్టాలను బీమా ద్వారా భర్తీ చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన 72 గంటల్లో తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి జ్యోతుల పెదబాబు, పెంటకోట శ్రీధర్, నూకతాటి ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేసిన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు

నూతన అధ్యక్షడిని సత్కరిస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది రాజాల చిట్టిబాబు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల వరకూ మాత్ర మేనని, తరువాత అందరూ ఒక్కటేనని అన్నారు. బార్ అసోసియేషన్ అభివృద్ధికి అందరం కలిసి కృషి చేద్దామని అన్నారు. ప్రత్తిపాడు కోర్టు సింగిల్ కోర్టుగా నడుస్తుందని, దీనికి అడిషనల్ కోర్టును తీసుకురావడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ మెంబర్ నరహరశెట్టి రవికృష్ణ, సీనియర్ న్యాయవాదులు చెలంకూరి రామకృష్ణ, బుగత శివ, బొంగులూరి మధుబాబు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 241/2024

Between:
Puvvala Vara Prasad ...Plaintiff
AND
Satyam Satish,and others ...Defendants

1. Satyam Satish, S/o. Nageswara Rao, Hindu, aged 33 years, D.No. 4-243/2, Society Street, Inugantivaripeta, Muggulla, Seethanagaram Mandal, E.G.Dt.,
...1, Defendant

పై నెంబరు దావాలో 1, ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 11-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.ఎస్.ఎస్.మురళీమోహన్
రాజమండ్రి జి.వి.రామలక్ష్మి
01-11-24 అడ్వకేట్స్, రాజమండ్రి

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 1180/2022

Between:
1. Smt. Marthvampati Chamundeswari
2. Mr. Marthvampati Gopi Krishna.
...Plaintiffs
AND
M/s.Gayatri English Medium Public School,and others ...Defendants

1. M/s.Gayatri English Medium Public School, Rajahmundry. Represented by Correspondent, Mr.Doddi Ramaswamy Naidu, Door No. 2-40-151, Oup.Railaway Hospital, Behind Medplus, Main Road, Aicot Gardens, Rajamahendravarem,
...1,Defendant

పై నెంబరు దావాలో 1, ప్రతివాది అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 11-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

జి.ఎస్.ఎస్.మురళీమోహన్
రాజమండ్రి జి.వి.రామలక్ష్మి
01-11-24 అడ్వకేట్స్, రాజమండ్రి

యానాం వార్తలు

మందులపై ఆరా తీస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్

ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఎల్ఎ తనిఖీలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఎఒ మునిస్వామితో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది అందిస్తున్న సేవలపై ఎంఎల్ఎ అసంతృప్తిని వ్యక్తం చేశారు. పేద ప్రజలకు ఉచితంగా మందులు అందించడం మానేసి ప్రయివేట్ దుకాణాల్లో తీసుకోమని చెప్పడంపై ఆయన మండిపడ్డారు. కాలం చెల్లిన మందులు ఇస్తున్నారని రోగుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని ఆసుపత్రి డిడి టి.రవిశంకర్, ఎడి పలాస్ కుమార్ సన్యాల్‌ను నిలదీశారు. ఇలాంటివి మళ్లీ పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. డాక్టర్లు, అంబులెన్స్ డ్రైవర్లు సమయపాలన పాటించడం లేదన్నారు. గర్భిణీ స్త్రీలను కాకినాడ రిఫర్ చేయాలనుకుంటే ముదస్తుగా వారికి తెలియ చేయాలని, అప్పటికప్పుడు చెప్పి తరలిస్తే మధ్యలో ఏమైనా జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఆసుపత్రిలో నూతన డిజిటల్ ఎక్సరే మిషన్ కొరకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని తెలిపారు. ఐసీయు విభాగాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి గత కొన్నేళ్ళగా జీతాలు ఇవ్వడం లేదని వాటి వివరాలను తనకు సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన రోగులతో మాట్లాడారు.

7న పాత వస్తువుల వేలం

ప్రజాశక్తి - యానాం

స్థానిక నెహ్రూ యువకేంద్రం కార్యాలయానికి చెందిన పాత వస్తువులను ఈ నెల 7న వేలం నిర్వహిస్తున్నట్లు కేంద్రం అధికారి తిర్రి గోపి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ వేలంలో ఉపయోగంలో లేని పాత వస్తువులైన ఇనుప కుర్చీలు, పాత కంప్యూటర్లు, టైప్ మెషిన్లు మొదలగు వస్తువులను వేలం వేస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు జిఎఫ్ఆర్ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, ఆధార్ కార్డు జిరాక్స్‌ను తీసుకురావాలన్నారు.

ఆదమరిస్తే అంతే...!

ప్రజాశక్తి - జగ్గంపేట

రహదారిలో పెద్ద గొయ్యి

మండలంలోని జె.కొత్తూరు శివారు రహదారి చిద్రంగా మారింది. ఈ రహదారి గుండా నిత్యం వందల సంఖ్య లో రాకపోకలు సాగుతుంటాయి. దీనిపై అధికారులకు పలు మార్లు విన్నవించుకున్నా పట్టించుకునే పాపాన పోలేదని గ్రామస్తులు, ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. జె. కొత్తూరు, రాజపూడి గ్రామాల మధ్యలో రహదారి పరిస్థితి గోతులతోనే ఉంది. రాత్రి సమయాల్లో వాహనదారులు ఆ గోతుల్లో పడి ప్రమాదాల భారిన పడుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మహారాజశ్రీ విజయవాడ 14వ అధనపు జిల్లా జడ్జి మరియు ఫ్యామిలీ కోర్టులో

FCOP No.1389 / 2019

బిట్వీన్
మాచినేని శిల్పా ...పిటీషనర్
వర్సెస్
మాచినేని కృష్ణకాంత్ ...రెస్పాండెంట్

టు (రెస్పాండెంట్)
మాచినేని కృష్ణకాంత్, తండ్రి : M.V.నాగేశ్వరరావు, వయస్సు 42సం॥లు, Sr. మెయింటెనెన్స్ ఇంజనీర్, బేకర్స్ & హాఫ్స్ సింగపూర్ PET ప్లాంట్ నెం.28 & 34, APIIC,ఇండస్ట్రియల్ పార్క్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా, సెల్ నెం.9966133353

పై నెంబరు FCOP లో మాచినేని శిల్పా పిటీషనర్ అయి ఉన్నారు. సదరు మాచినేని కృష్ణకాంత్ FCOP నందు రెస్పోండెంట్ గా యుండి యున్నారు. పిటీషనర్ అయిన మాచినేని శిల్పా సదరు మాచినేని కృష్ణకాంత్ పై విజయవాడ 14వ అదనపు జిల్లా జడ్జి మరియు ఫ్యామిలి కోర్టు నందు మెయింటెనెన్స్ కొరకు తన భర్త అయిన మాచినేని కృష్ణకాంత్ పై పిటీషన్ దాఖలు చేసి యున్నారు. గౌరవ కోర్టు వారు పిటీషనర్‌కి అనుకూలముగా తీర్పు ఇచ్చి యున్నారు. దానికి గాను పిటీషనర్ **Crl.M.P.No.83 / 2024** దాఖలు చేసి శ్రీ కోర్టు వారు రెస్పోండెంట్ అయిన మాచినేని కృష్ణకాంత్ గారికి నోటీసులు జారీ చేసి యున్నను. సదరు నోటీసులను ఉద్దేశ్యపూర్వకముగా వాటిని తీసుకొనకుండా వుండుట చేత పిటీషనర్ శ్రీ కోర్టు వారికి పేపర్ ప్రకటన ద్వారా తెలియజేయుటకు పిటీషన్ దాఖలు చేసుకోగా శ్రీ కోర్టు వారు దానికి అంగీకరించి నందున రెస్పాండెంట్ అయిన మాచినేని కృష్ణకాంత్ గారికి శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ఈ ప్రకటన ద్వారా నోటీసు ఈ FCOP దావాలో రెస్పాండెంట్ కు జారీ చేయడం అయినది. కావున మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తేదీ. **20-12-2024**న ఉదయం గం.**10.30** ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని ప్లీడర్ గారి ద్వారా గాని హాజరై తెలుపు కోవలెను. లేని యెడల మీకు పరోక్షమున తీర్మానం చేయబడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేదీ : 20-12-2024

Bandla Sambasiva Rao
Advocate
D.No.27-20-33,
Museum Road
విజయవాడ Vijayawada
29-10-2024 CellNo.9848020180

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి. నెం. 12285/2002-ఎ1 తేది.05-11-2024

వేలం నోటీసు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధీనములోని వివిధ షాపింగ్ కాంప్లెక్సులలో ఖాళీగా ఉన్న షాపు రూములు (జాబితాలో 8వ కాలము నందు చూపబడిన రిజర్వుడు కేటగిరి షాపులు మినహాయించి) స్వాధీనం చేయబడిన తేదీ నుండి లేదా నగరపాలక సంస్థ నిర్ణయించిన తేదీ లగాయితూ 3 సంవత్సరముల కాలం నెలసరి అద్దె చెల్లించు ప్రాతిపదికపై అనుభవించు గుత్త హక్కును వేలమును నగరపాలక సంస్థ కార్యాలయము నందు ది. 20-11-2024 తేదీ నుండి ది. 25-11-2024 తేదీ వరకు నిర్వహించబడును.

వేలములో పాల్గొనుటకు ఆసక్తి గలవారు యిందుతో జతపర్చబడిన పట్టికలో చూపిన ప్రకారము ధరావత్తు సొమ్ము కమిషనరు, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం వారి పేరున డిమాండు డ్రాఫ్టు మరియు మూడు సంవత్సరముల కాలమునకు బ్యాంకు గ్యారంటీ తీసుకొని ఆఫీసులో ది. 19-11-2024వ తేదీ మధ్యాహ్నం గం॥ 1.00 లోపు దరఖాస్తు దాఖలు చేయవలెను. చెక్కులు స్వీకరించబడవు. ఒక్కొక్క షాపునకు విడివిడిగా ధరావత్తు, బ్యాంకు గ్యారంటీ, ఆధార్ జిరాక్సులతో దరఖాస్తు దాఖలు చేయవలెను. దరఖాస్తు దాఖలు పరచినవారిని మాత్రమే వేలమునకు అనుమతించబడును. వేలం కమిషనరు గారిచే గాని, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని నిర్వహించబడును. వేలములో పాల్గొనువారు నగరపాలక సంస్థకు ఏ విధమైన బకాయిలు వుండరాదు.

వేలములో ఖాయపరచిన అద్దెతో 3 నెలల అద్దె (జి.ఎస్.టి. అదనము) అడ్వాన్సుగా 7 దినములలోగా చెల్లించిన తదుపరి షాపు అప్పగించబడును. వేలములో ఖాయపరచిన అద్దెపై 18% జి.ఎస్.టి. తో ప్రతి నెల 10వ తారీఖు లోగా కలిపి చెల్లించవలెను. మొదటిసారి లీజు కాలము 3 సంవత్సరములు, తదుపరి 3 సంవత్సరములకు స్థాయీ సంఘము వారి ఆమోదమునకు లోబడి 33 1/3 శాతం పెంపుదల (లేదా) 10% మార్కెట్ విలువ సంవత్సరము అద్దెగా లేదా పరిసరాల ప్రాంతాలలోని షాపుల అద్దె విలువ ఏది అధికమో దానిపై అద్దె హెచ్చింపు నిబంధనపై పొడిగించబడును. లీజుకాలము 25 సంవత్సరముల వరకు మాత్రమే పొడిగించబడును. తదుపరి షాపు నగరపాలక సంస్థకు అప్పగించవలెను. వేలం ఖాయపరచుటకు లేదా తిరస్కరించుటకు కమిషనరు గారికి పూర్తి అధికారం కలదు. మరియు నగరపాలక సంస్థ విధించు అన్ని ఇతర షరతులకు లోబడి వేలము నందు పాల్గొనవలెను. నగరపాలక సంస్థ కార్యాలయములో రెవెన్యూ విభాగము నందు ఎ16 గుమస్తా నుండి షాపులు, నెలవారీ అద్దె, చెల్లించవలసిన ధరావత్తు, దాఖలు చేయవలసిన బ్యాంకు గ్యారంటీ, వేలం నిర్వహించుచున్న తేదీ మొదలగు వివరములను పొందగలరని తెలియచేయడమైనది.

సం/- **కేతన్ గార్గ్,** కమిషనరు
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం